క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో గొబ్బెమ్మలకు పూజలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదిక వద్ద సోమవారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. సంక్రాంతి పర్వదినం నేపథ్యంలో కంచి కామకోటి పీఠం విద్యార్థునులచే సంధ్య గొబ్బెమ్మలకు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత వేదిక వద్ద గొబ్బెమ్మలకు పూజలు నిర్వహించిన అనంతరం విద్యార్థులు ఆడిపాడారు. అనంతరం చిన్నారులకు భోగి పండ్లు పోసే కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు దేవస్థానం తరుపున అమ్మవారి ప్రసాదాలు, వాయినాలను అందజేశారు. కార్యక్రమాన్ని ఆలయ స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ పర్యవేక్షించగా, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భారత దేశం గర్వించతగిన వ్యక్తి తొలి అంతరిక్ష వ్యోమగామి రాకేష్‌శర్మను నేటితరం యువత ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఎదగాలని రాకేష్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎన్వీ రావు పిలుపునిచ్చారు. తొలి అంతరిక్ష వ్యోమగామి రాకేష్ శర్మ 76వ పుట్టినరోజు వేడుకలు సోమవారం కేఎల్‌రావునగర్‌లోని పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్కూల్ అందరికీ పంచిపెట్టారు. 50 మంది పేదలకు దుప్పట్లు, దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయని రేణుకాదేవి, బి. ఉదయ్‌కిరణ్, డాక్టర్ నీరజ, కె.రమేష్, సాధికా, మెహరాజ్, మల్లేశ్వరి పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పెంచిన విద్యుత్‌చార్జీలను తక్షణమే తగ్గించాలని సీపీఎం 51వ డివిజన్ కార్యదర్శి కే సూరిబాబు డిమాండ్ చేశారు. భోగి పండుగను పురస్కరించుకుని సోమవారం స్థానిక సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో పెంచిన విద్యుత్ బిల్లుల దగ్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను వేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సూరిబాబు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని హామీ ఇచ్చిన అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, నేడు ప్రజలపై విద్యుత్‌చార్జీల పేరుతో వేలాది కోట్ల భారం మోపడం తగదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల మేరకు తక్షణం పెంచిన విద్యుత్ భారాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఏడు సెల్‌ఫోన్లు రికవరీ, బాధితులకు అందజేత

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్సు ఎక్కే సమయంలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ప్రయాణికులకు కృష్ణలంక పోలీసులు వాటిని రికవరీ చేసి తిరిగి అందజేశారు. సంక్రాంతి పండగ రద్దీ నేపథ్యంలో ప్రజలు వారివారి గ్రామాలకు వెళ్తుండడంతో బస్టాండ్ కిక్కిరిసిపోయింది. దీనిని అదనుగా చేసుకున్న కొందరు దొంగలు హడావుడిగా బస్సు ఎక్కే ప్రయాణికుల సెల్‌ఫోన్లు దొంగిలించారు. సమాచారం అందుకున్న వెంటనే కృష్ణలంక పీఎస్ సీఐ నాగరాజు తన బృందంతో బస్టాండ్‌కు చేరుకున్నారు. బస్టాండ్ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చేసి వారి వద్ద నుంచి ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. చోరీకి గురైన ఫోన్లను గంటల వ్యవధిలో రికవరీ చేసి తిరిగి అందజేయడంతో బాధితులు సీఐకు కృతజ్ఞతలు తెలిపారు.

త్రిశక్తి పీఠంలో అమ్మవార్లకు విశేష పుష్పార్చన

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో భోగి పండుగ సందర్భంగా సోమవారం మహాకాళీ, మహాలక్ష్మి, మహాసరస్వతీ అమ్మవార్లకు విశేష పుష్పార్చన నిర్వహించారు. భక్తులు సమర్పించిన 300 కేజీల వివిధ రకాల పూలతో ప్రత్యేక పూజలు చేసి పుష్పార్చన జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జి.పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు భరతుల విజయకిరణ్, సూపరింటెండెంట్ మధుసూదనరావు, సభ్యులు జి.సత్యనారాయణ, సుబ్బారావు, టి.మల్లేశ్వరరావు, పరమేశ్వరరావు, విశ్వేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.

బరిలో దూసుకుపోతున్న పందెం కోళ్లు

- కొత్తపేట పరిధిలో నాలుగు బరుల ఏర్పాటు
- పార్కింగ్, మద్యం విక్రయాలకు వేలం



అంబాపురంలో యథేచ్ఛగా సాగుతున్న కోడిపందేల వద్ద నెలకొన్న సందడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సంక్రాంతి సంబరాల పేరిట వినోదం ముసుగులో జూదాల నిర్వహణ హెచ్చురిల్లిపోయింది. కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు ప్రాంతాల్లో కోడి పందెల కోసం బరులు ఏర్పాటు చేశారు. సంక్రాంతికి కోడి పందెలను నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామంటూ కొద్దిరోజులుగా పోలీసులు చేసిన హడావుడి అంతాఇంతా కాదు. స్టేషన్ పరిధిలోని నాలుగు ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న పందెం బరులను పోలీసులు ట్రాక్టర్‌తో దుక్కి దున్నించడం, సిమెంట్ దిమ్మలను ధ్వంసం చేశారు. గ్రామాల్లో మైక్‌లతో ప్రచారం నిర్వహించడంతోపాటు పొలం యజమానులు, మామిడితోట యజమానులకు సైతం నోటీసులు జారీచేశారు.

తీరా భోగిపండుగ రోజున బరుల్లో కోడిపందేలు యథేచ్ఛగా సాగగా, పోలీసులు ఆవైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. దీంతో వారం రోజులుగా పోలీసులు గ్రామాల్లో నిర్వహించిన ప్రచారం నిరుపయోగంగా మారింది.

జోరుగా పేకాట, గుండాట..

కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాముల కాల్వ, పోలవరం కాల్వ సమీపంలోని ఆంజనేయస్వామి గుడి, అంబాపురం ఇన్నర్‌రింగ్ రోడ్డు ప్రాంతాలతోపాటు గ్రామంలోని ఓ ఎస్టేట్ కేంద్రంగా కోడి పందెల బరులు ఏర్పాటు చేశారు.

బరులు ఏర్పాటు చేయడంతోనే జూదాలకు తలుపులు తెరిచారు. ఇందుకోసం అధికార కూటమి నాయకులు లక్షలాది రూపాయలను వెదజల్లారనే ప్రచారం సాగుతోంది. పందెం బరుల పరిసరాల్లో పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించి వాటిస్థానంలో నేతల ఫోటోలతో స్వాగత బ్యానర్లు ఏర్పాటు చేశారు. బరుల వద్దే పేకాట, కోతముక్కలు, లోపు బయట ఆటలు నిర్వహిస్తున్నారు.



అంబాపురంలో జోరుగా సాగుతున్న నంబర్లాట

బరుల వద్ద ఆయా కేంద్రాలను ఏర్పాటు చేసుకునేవారి వద్ద నుంచి నిర్వాహకులు మూడు రోజులగాను రూ.లక్షల్లోనే వసూలు చేసినట్లు ప్రచారం సాగుతోంది.

పార్కింగ్‌కు బహిరంగ వేలం

కోడి పందేలు నిర్వహించే బరుల వద్దకు వచ్చే వారి వాహనాల నుంచి పార్కింగ్ ఫీజు వసూలుకు వేలం నిర్వహించడం గమనార్హం. చట్ట విరుద్ధమైన కోడి పందెం శిబిరాల వద్ద పార్కింగ్ ఫీజును యథేచ్ఛగా వసూలు చేస్తూ వాహనచోదకుల జేబులకు చిల్లుపెడుతున్నారు. నాలుగు బరుల వద్ద మూడు రోజులకు పార్కింగ్ ఫీజు వసూలు చేసుకునేందుకు వేలం నిర్వహించగా, రూ. 30 లక్షలకు పైబడి పలికినట్లు సమాచారం. ఇక బరుల వద్ద ఏర్పాటు చేసే బిర్యానీ పాయింట్లు, మద్యం విక్రయాలు జరిపే బెల్ట్ షాపులు, ఇతర దుకాణాల నిర్వహణదారుల నుంచి నిర్వాహకులు వేలాది రూపాయలు దండుకున్నారు.

లక్షల్లో చేతులు మారుతున్న డబ్బు..

విజయవాడ రూరల్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన బరుల వద్ద సోమవారం ఉదయం నుంచే రూ. లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. ఇక పోలీసులు బరుల వైపు వస్తే నిర్వాహకులకు ముందుగా సమాచారం ఇచ్చేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకుని సైతం కోళ్లపందేలను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. పాముల కాల్వ, నైనవరం ఫ్లైఓవర్ పరిసరాల్లో ప్రత్యేకంగా ఇందుకోసం వ్యక్తులను నియమించుకున్నట్లు తెలుస్తుంది. కోళ్లకు కత్తులు కట్టకూడదని పోలీసులు ముందుగానే హెచ్చరించినా పందెలలో కత్తులతో కోళ్లను వదలడం కనిపిస్తోంది. కోళ్లకు కత్తులు కట్టే వారికి పోలీసులు ముందుగానే నోటీసులు జారీ చేసినా ఆనోటీసులను సదరు వ్యక్తులు పట్టించుకోకపోవడం కొసమెరుపు.

వైభవంగా ఆరుద్రోత్సవం



ఉత్తర ద్వారంలో దర్శనమిస్తున్న నగరేశ్వరుడు



పాతశివాలయం మల్లేశ్వరునికి అన్నాభిషేకం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆరుద్రోత్సవం సందర్భంగా వన్‌టౌన్‌లోని పలు శైవాలయాల్లో సోమవారం విశేష కార్యక్రమాలను నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఆయా ఆలయాల్లో స్వామివారికి అభిషేకాలు చేశారు. స్వామివారి జన్మనక్షత్రంతోపాటుగా ఆయన ప్రీతికరమైన సోమవారం, అందులోనూ పౌర్ణమి, భోగి పర్వదినం కలిసిరావడంతో భక్తులు విశేషంగా భావించి పూజల్లో పాల్గొన్నారు.

పాతశివాలయంలో....

శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో ఆరుద్రోత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. పాతశివాలయంలో స్వామివారికి ఆదివారం అర్ధరాత్రి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, అమ్మవారికి విశేష అర్చనలు చేశారు. తెల్లవారుజామున స్వామివారి ఉత్సవమూర్తులు ఉత్తరద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు వైదిక కార్యక్రమాలను పర్యవేక్షించగా, ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నగరేశ్వరస్వామి సన్నిధిలో...

కొత్తగుళ్ల ప్రాంగణంలో ఉన్న శ్రీ నగరేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆరుద్రోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పలు విశేష కార్యక్రమాలను నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి స్వామి వారికి అభిషేకాలను నిర్వహించారు. అనంతరం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఉదయం అభిషేకాల అనంతరం స్వామి వారిని ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాలను ఆలయ అర్చకులు పర్యవేక్షించారు.

11మంది జూదరుల అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జక్కంపూడిలో గుట్టుచప్పుడుగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు సీఐ కొండలరావు తెలిపారు. జక్కంపూడిలోని రామాలయం వీధిలో పేకాడుతున్న వారిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.23,040 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

కనులపండువగా గోదాదేవి కల్యాణం



కొత్తగుళ్ల ప్రాంగణంలో సాగుతున్న గోదాదేవి కల్యాణోత్సవ వేడుక



ప్రత్యేకాలంకరణలో శ్రీవేంకటేశ్వరస్వామి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా వన్‌టౌన్‌లోని పలు ఆలయాల్లో సోమవారం గోదాదేవి రంగనాయకస్వామి వార్ల కల్యాణోత్సవాన్ని అత్యంత కన్నుల పండువగా నిర్వహించారు. భోగి పండుగను పురస్కరించుకొని పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వైష్ణవులు పరమపవిత్రంగా భావించే ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ధనుర్మాసంలో అత్యంత విశేషమైన రోజుగా భావించే భోగి సందర్భంగా ఆయా ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. స్వామివార్లకు నగరోత్సవాలను నిర్వహించారు.

గీతామందిరంలో..

పాతబస్తీ ఇస్లాంపేటలోని గీతామందిరంలో గోదాదేవి కల్యాణోత్సవం వైభవంగా సాగింది. మందిరంలో శ్రీకృష్ణార్జున మూలమూర్తులకు విశేష వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. శాంతి సత్సంగ మండలి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. అధ్యక్షులు జమిలి పురుషోత్తమరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నగరోత్సవం..

వన్‌టౌన్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో గోదాదేవి రంగనాయకుల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం అమ్మవారికి నగరోత్సవాన్ని నిర్వహించారు. వైదిక కార్యక్రమాలను పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి నిర్వహించారు.

కోదండరాముని సన్నిధిలో..

పాతబస్తీ శేషయ్యవీధిలోని కొత్తగుళ్ల ప్రాంగణంలోని కోదండరాముని సన్నిధిలో సాయంత్రం గోదాదేవి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. పండుగను పురస్కరించుకుని కోదండరాముని మూలమూర్తులకు విశేష అలంకారాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పులిపాక రాఘవాచార్యులు, ఆంజనేయాచార్యులు పూజలు చేశారు. పాండురంగని ఉపాలయంలో గోదాదేవి సమేత పాండురంగని కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

కొత్తపేట శ్రీ నగరాల సీతారామస్వామి,, సైకం వారివీధిలోని శ్రీసీతారామస్వామి, భావనారాయణవీధిలోని కోదండరామస్వామి వారి దేవస్థానం తదితర ఆలయాల్లో నిర్వహించిన పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామివార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

సందడిగా భోగి వేడుకలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగిపండుగను ప్రజలు సోమవారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు తేడా లేకుండా వేకువజామునే భోగి మంటలు వేశారు. కలప దుంగలు ఇతరసామగ్రి, పిడకలతో తయారు చేసిన దండలను ఆ మంటలల్లో వేసి భోగి వేడుకలను నిర్వహించారు. వీధివీధుల్లో, కూడలి ప్రాంతాలు, ఆలయాల వద్ద ఈ భోగి మంటలు వేడుకగా దర్శనమిచ్చాయి. మహిళలు తమ ఇళ్ల ముంగిళ్లలను అందమైన రంగవల్లులతో తీర్చిదిద్దారు. ప్రజలు ఆయా ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. సాయంత్రం వేళల్లో పెద్దలు తమ చిన్నారులకు భోగిపండ్లు పోసి ఆశీస్సులందజేశారు.

గీతామందిరంలో పూజలు

భోగి వేడుకల్లో భాగంగా పాతబస్తీలోని గీతామందిరంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ కృష్ణభగవానుడుకి ఉదయం నుంచి విశేష వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని జరిపించారు. కార్యక్రమాల్లో స్థానిక ప్రముఖులు నరహరిశెట్టి రామచంద్రరావు, నరహరిశెట్టి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

48వ డివిజన్‌లో సంక్రాంతి సంబరాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సంక్రాంతి సంబరాల్లో భాగంగా పశ్చిమ నియోజకవర్గంలోని 48వ డివిజన్ పరిధిలోని సొరంగం వద్ద బెవర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు అందమైన రంగవల్లులను ప్రత్యేకాకర్షణగా తీర్చిదిద్దారు. ఆయా పోటీల విజేతలకు వైఎస్సార్ సీపీ నేత పోతిన వెంకట మహేష్ బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముగ్గుల పోటీల నిర్వాహకుడు బెవర శ్రీనివాసరావును అభినందించారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో మకర సంక్రాంతి పర్వదినాలు మార్పులు తీసుకువస్తాయని పేర్కొన్నారు. వాటిని స్వాగతిస్తూ జీవనం కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ డీవీ రమణ బాబు, పంచదార్ల దుర్గాంబ, నగరాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాయన బాబ్జీ, ఎల్ రామకృష్ణ, పిళ్లా రవి, మరుపిళ్ల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

కోటి ఆవు పిడకలతో భోగిమంటలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం శివాలయం సెంటర్‌లో అమరావతి ఉత్సవ సమితి ఏపీ ఆధ్వర్యంలో కోటిఆవు పిడకల మహాయజ్ఞం పేరుతో నిర్వహించిన భోగి మంటల కార్యక్రమం కోలాహలంగా సాగింది. చిన్నారులకు పిల్లలకు సమూహికంగా భోగి పళ్లు పోసి మనసారా ఆశీర్వదించారు. సెంటర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై చిన్నారుల ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. నడుముకు రింగ్ ధరించిన చిన్నారులు మంటలతో కూడిన కుండలు చేతబూని చేసిన నృత్యం ప్రత్యేకార్షణగా నిలిచింది. ఈ సందర్భంగా సమితి అధ్యక్షులు బబ్బూరి భూపాల్ మాట్లాడుతూ తగ్గిపోతున్న దేశీయ ఆవుల పెంపకాన్ని ప్రోత్సహించే క్రమంలో గో పిడకలతో 8ఏళ్లుగా భోగి మంటల సంబరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సమితి సెక్రటరీ బోయపాటి నాని, సభ్యులు బబ్బూరి శ్రీరామ్, యజ్ఞ శ్రీనివాస్, పగడాల కృష్ణ , పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ పాల్గొన్నారు.



శివాలయం సెంటర్‌లో గో పిడకలతో భోగి మంటలు వేస్తున్న జనం



గీతామందిరంలో శ్రీ కృష్ణభగవానుడు



ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులందిస్తున్న మహేష్, చిత్రంలో మేయర్ భాగ్యలక్ష్మి



శ్రీ నగరాల సీతారామస్వామి దేవస్థానం ఎదుట భోగి మంటలు



గంగిరెద్దును ఆసక్తిగా తిలకిస్తున్న చిన్నారులు

చంద్రబాబు ప్రభుత్వంపై ధ్వజమెత్తిన మహిళలు

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం



భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను తగులబెడుతున్న మహిళలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంచడాన్ని నిరసిస్తూ పలువురు మహిళలు భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను తగులపెట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర సమితి పిలుపు మేరకు 45వ డివిజన్ పరిధిలోని న్యూ భగత్‌సింగ్ నగర్‌లో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య విజయవాడ నగర ప్రధానకార్యదర్శి పంచదార్ల దుర్గాంబ పాల్గొని ప్రసంగించారు.

అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపు విషయంలో 'ఏరు దాటిన తరువాత తెప్ప తగలేసిన' చందంగా వ్యవహరిస్తోందని ఆమె మండిపడ్డారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కరెంట్ చార్జీల పెంపుపై 'బాదుడే బాదుడు' అంటూ కార్యక్రమాలను నిర్వహించి, ఇప్పుడు చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని, అవకాశం ఉంటే తగ్గిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు కూటమి చేసినవి ఉత్తుత్తి వాగ్దానాలేనా అంటూ ధ్వజమెత్తారు. విద్యుత్ వినియోగం మేరకే చార్జి చేస్తామని, ట్రూఅప్ చార్జీలు, ఎఫ్‌పీపీసీఏ చర్జీలు విధించబోమంటూ ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు మరిచిపోయారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంపద సృష్టించడమంటే కరెంట్ చార్జీలు ఇష్టమొచ్చినట్లు పెంచడం కాదని ఎద్దేవా చేశారు. ఇప్పుడు వస్తున్న విద్యుత్ బిల్లులు చూస్తే సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు షాక్‌కు గురవుతున్నాయన్నారు. ఇప్పటికైనా పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకులు పి.తవుడమ్మ, కోటి మల్లీశ్వరి, ఆర్.జ్యోతి, జి.శాంతి, అరుణ, పాగిరి మణి, సామ్రాజ్యం, అంకమ్మ, మున్నీ, కాసులమ్మ, దుర్గ పాల్గొన్నారు.

కోడిపందేల ముసుగులో మినీ క్యాసినో సెంటర్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సంక్రాంతి సంస్కృతి, సంప్రదాయాలను మంటకలుపుతూ అధికార కూటమి నేతలు విజయవాడ నగరంలో కోడి పందేల ముసుగులో మినీ క్యాసినో సెంటర్లను నిర్వహిస్తుండటం అత్యంత దారుణమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పోతిన మహేష్ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. విజయవాడతో పాటుగా పరిసర ప్రాంతాల్లో కోడిపందేలు కంటే అధికస్థాయిలో జూదం నడుస్తోందన్నారు. ప్రధానంగా పేకాట, గుండాట అనే జూదక్రీడలేనని పేర్కొన్నారు. ఒక్కొక్క బరికి సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధి, అధికారులకు రూ.20లక్షల నుంచి రూ.30లక్షలను ముడుపుల రూపంలో ముట్టజెప్పుతున్నారంటే ఈ జూదం ఏస్థాయిలో నిర్వహిస్తున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. హైకోర్టు ఉత్తర్వులు ఉన్నాయని కోడిపందేల బరులకు అనుమతి లేదని పోలీస్‌శాఖ ఇచ్చిన హెచ్చరికలు చివరికి నిరుపయోగంగా మారాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేకాటకి అధికారికంగా ఆమోదం లభించిందా? అన్నట్లుగా పరిస్థితి నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వ అండదండలతో నాయకులు ప్రజల సొమ్మును కోడిపందేల రూపంలో దోచుకుంటున్నారని ఆరోపించారు. కోడిపందేలు, పేకాట కారణంగా ఎన్నో కుటుంబాలు రోడ్డునపడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నగర పోలీస్ కమిషనర్ తక్షణమే స్పందించి కోడి పందేల పేరుతో భారీ టెంట్లను ఏర్పాటు చేసి జూదాన్ని నిర్వహిస్తున్న వారిపై కఠినచర్యలు తీసుకుని జూదం బారినుంచి ప్రజలను కాపాడాలని ఆయన కోరారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి



వేముల హజరత్తయ్య గుప్తాను సత్కరిస్తున్న వాసవీ అభ్యుదయ కపుల్స్

లబ్బీపేట(విజయవాడతూర్పు): సమాజంలో సేవా కార్యక్రమాలు చేపట్టడంతో పాటు భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలను వాసవీ క్లబ్‌లు కాపాడాలని వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. వాసవీ క్లబ్ అభ్యుదయ కపుల్స్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వివిధ సంప్రదాయాలు ఉట్టి పడే విధంగా కార్యక్రమాలను చేపట్టారు. ఎంజీ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ.. నూతనంగా పదవులు చేపట్టిన వారు అహం లేకుండా ప్రథమ సేవకులుగా పని చేయాలని పిలుపునిచ్చారు. అభ్యుదయ కపుల్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా చలువాది శ్రీనివాసరావు, కార్యదర్శిగా పాదర్తి శ్రీనివాసరావు, కోశాధికారిగా ఆత్మకూరి శ్రీనివాసరావులతో గవర్నర్ సాయి సునీత ప్రమాణ స్వీకారం చేయించారు. హజరత్తయ్య గుప్తాను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పేర్ల రవి, హరిప్రసాద్, సూర్యప్రకాశ్, మానస, శైలజ, పుష్పవల్లి, ముక్తేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శక్తిపీఠం వార్షికోత్సవం ప్రారంభం



గణపతి హోమం నిర్వహిస్తున్న అర్చకుడు

మధురానగర్ (విజయవాడ సెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠం 8వ వార్షిక వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాత సేవ, విఘ్నేశ్వర పూజతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అమ్మవారికి విశేషంగా 14 అభిషేకాలు, లోక కల్యాణార్థ గణపతి హోమాన్ని వేద పండితులచే శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యాన సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు కుంకుమ పూజలలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి భజన, పారాయణం జరిగింది. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు పర్యవేక్షించారు.